మున్సిపల్ ఎన్నికల్లో కనిపించని కారు జోరు

ప్రచారానికి ముఖం చాటేస్తున్న కీలక నేతలు
పట్టించుకోని మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు
బహిరంగ సభలు, రోడ్డు షోలు నిల్
ఖర్చుకు భయపడా..? గెలిచినా పార్టీ మారతారనా..?
బీఆర్ఎస్ అభ్యర్థుల్లో అయోమయం

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : మున్సిపల్ ఎన్నికల్లో గెలుపుపై బీఆర్ఎస్ ఆశలు వదులుకున్నదా?.. ఎంత ప్రచారం చేసినా ఫలితం లేదని నీరుగారిపోయిందా?.. ఇన్‌చార్జిలు చూసుకుంటారనివారికే వదిలేసిందా?..ఎలాగూ ఓడిపోకతప్పదనే అంచనాతోబహిరంగసభలు వద్దనుకున్నదా?..ట్యాపింగ్‌ఉచ్చులో చిక్కుకుపోయిందా?.. ఇలాంటి అనేక సందేహాలు ఇప్పుడు ఆ పార్టీ శ్రేణుల్ని వెంటాడుతున్నది. రాష్ట్రంలో కనీసంగా 35 చైర్‌పర్సన్ స్థానాలను గెల్చుకుంటామని మొదట్లో ధీమా వ్యక్తం చేసినా ఇప్పుడు మాత్రం సైలెంట్‌గా ఉండిపోయింది. పార్టీ అధినేత ఫామ్ హౌజ్‌కు పరిమితమయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిసిల్ల జిల్లామీద ఫోకస్ పెట్టారు.సీనియర్ నేత ఉమ్మడి మెదక్ జిల్లాపై కేంద్రీకరించారు. మిగిలిన చోట్ల అసెంబ్లీ నియో జకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమించి పార్టీ చేతులు దులుపుకున్నది.

సభల్లేవ్.. సందడీ లేదు

పంచాయతీ ఎన్నికల్లో ఆశించినదానికంటే ఎక్కువ ఫలితాలే వచ్చాయని బీఆర్ఎస్ నేతలు గొప్పగా చెప్పుకుంటున్నారు. అధికారంలో ఉండి కూడా కాంగ్రెస్ 60% సీట్లు సాధించలేక పోయిందని కామెంట్ చేసింది. మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటాలని శ్రేణులకు పిలుపునిచ్చింది. ఒకవైపు కాంగ్రెస్, బీజేపీ అగ్రనేతలు బహిరంగసభలతో హడావిడి చేస్తూ ఉంటే బీఆర్ఎస్ మాత్రం సైలెంట్‌గా ఉండిపోవడమే వారికి మింగుడు పడడం లేదు. ఎవరికి వారే యమునాతీరే..చందంగా పార్టీని లీడ్ చేయడంలో నేతలు దూరదృష్టితో లేరనే అభిప్రాయం వినిపిస్తున్నది. డబ్బుల ఖర్చుకు వెనకాడుతున్నారా?.. లేక ఎలాగూ గెలిచే చాన్స్ లేదనే భావనతో ఖర్చును తగ్గించుకుందా మనుకుంటున్నారా?.. గెలిచిన తర్వాత అధికార పార్టీలోకి వెళ్తా రనే అనుమానంతో హడావిడి చేయడంలేదా?.. ఇలాంటి మాటలు కూడా వినిపిస్తున్నాయి.

ప్రతిపక్షంలో ఉన్నందుకే ఈ ఆలోచనా?

అధికారంలో ఉన్నప్పుడు ఎంతో హడావిడి చేసిన బీఆర్ఎస్ ఇప్పుడు ఎందుకు భిన్నంగా వ్యవహరిస్తుందన్నదే ఆ పార్టీ కేడర్‌నువిస్మయానికి గురిచేస్తున్నది. అప్పుడున్న స్పిరిట్ ఇప్పుడు పార్టీలో కనిపించడంలేదన్నది వారి భావన. ప్రారంభంలో వార్డు స్థాయిలోనే ఫంక్షన్ హాళ్లలో ఐదారువేల మందితో కార్యకర్తల మీటింగులను పెట్టాలనుకుని ఆ తర్వాత మనసు ఎందుకు మార్చుకున్నారనే అయోమయం వారిని వెంటాడుతున్నది. చివరకు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమించి పార్టీ చేతులు దులుపుకున్నది. ఇప్పటివరకు భారీ బహిరంగసభలకు పార్టీ ప్లాన్ చేయలేదు. పార్టీ సింబల్‌పైన ఎన్నికలు జరుగుతున్నా పక్కా కార్యాచరణతో కేడర్‌ను జిల్లా స్థాయి నేతలను కదిలించడంలో విఫలమైంది.

పార్టీ కెపాసిటీ ఎంతో తెలిసేది గదా.. !

నిజంగా కొట్లాడితే గెలిచే ఛాన్స్ ఉన్నా ఎందుకు చేజార్చుకుంటున్నదనేది పార్టీ కార్యకర్తలను గందరగోళానికి గురిచేస్తున్నది. నేతలంతా సమిష్టిగా రంగంలోకి దిగి కదిలితే, కేడర్‌లో ఉత్సాహం నింపితే పార్టీ సత్తా ఏంటో తెలిసేది గదా అనేది వారి ఉద్దేశం. ప్రజల్లో పార్టీ మళ్లీ పుంజుకునే అవకాశం దక్కేదని, ఈ ఉత్సాహంతో రాబోయే అసెంబ్లీ ఎన్నికల వరకు కేడర్‌లో జోష్ నింపడానికి దోహదపడేదన్నది వారి మాటల్లో వ్యక్తమవుతున్నది. అలాంటి ప్రయత్నాలు చేయకపోవడంతో ప్రజలకు రాంగ్ మెసేజ్ వెళ్తుందన్న ఆవేదన కనిపిస్తున్నది. మరో నాలుగు రోజులే ప్రచారం ఉన్నా హరీశ్‌రావు, కేటీఆర్ వారివారి జిల్లాలకు మాత్రమే పరిమితమవుతున్నారని, రాష్ట్రమంతా తిరిగి క్యాంపెయిన్ చేసే స్టార్ లీడర్లు కరువయ్యారన్న నీరస కేడర్‌లో కనిపిస్తున్నది. అసలు పార్టీలో ఏం జరుగుతున్నదనే సందేహాలు కనిపిస్తున్నాయి.

హైదరాబాద్‌ను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా తీర్చిదిద్దుతాం: మంత్రి ఉత్తమ్

విశ్వంభర, హైదరాబాద్ : హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా నిల పడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయి కంపెనీలు, పారిశ్రా మికవేత్తలను ఆకర్షించేలా హైదరాబాద్‌లో అనుకూ లమైన వాతావరణాన్ని కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. తెలంగాణ అభివృద్ధిలో హైదరాబాద్ కీలక పాత్ర పోషిస్తోందని, రాబోయే రోజుల్లో మరిన్ని భారీ పెట్టుబడులను సాధించడమే తమ ప్రభుత్వ ప్రాధాన్యతఅని ఆయనపేర్కొన్నారు.నగరంలో శాంతి భద్రతల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, సురక్షితమైన వాతావరణం ఉన్నప్పుడే పెట్టుబడులు వెల్లువెత్తుతాయని మంత్రి అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ లో వరల్డ్ క్లాస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. మెరుగైన రవాణా వ్యవస్థ, నిరంతర విద్యుత్ సరఫరా, అత్యాధునిక సౌకర్యాల కల్పన ద్వారా నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్ది, గ్లోబల్ మ్యాప్‌లో అగ్రస్థానంలో నిలుపుతామని ఉత్తమ్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

శ్రీ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణకు పివి నర్సింహారావు స్మారక అవార్డు

విశ్వంభరా హైదరాబాద్: ఆధ్యాత్మిక రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న శ్రీ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణకు పివి నరసింహారావు స్మారక అవార్డును అందజేశారు. మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో నిష్టమైతులైన వారికి అవార్డులు ప్రదానం చేస్తున్నారు. వివిధ రంగాల్లో సేవ లందిస్తున్న నిష్ణాతులకు అవార్డులు ప్రధానం చేస్తున్న పరంపరలో భాగంగా ఆధ్యాత్మిక రంగంలో సేవలు అందిస్తూ ఆధ్యాత్మిక సందేశాలిస్తూ ప్రజల్లో భక్తి భావాలు పెంపొందిస్తున్న క్రమంలో శ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి మాదంశెట్టి అనిల్ కుమార్ అవార్డును అందజేసి శాలువతో సత్కరించి అభినందించారు. రాజకీయ సాంస్కృతిక విద్య వైద్యం తదితర రంగాల్లో సేవలందిస్తున్న వారికి అవార్డులు అందజేయడం ఫౌండేషన్ ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతుంది. ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బాదం శెట్టి అనిల్ కుమార్ మాట్లాడుతూ పీవీ నరసింహారావు స్మారకార్థం అవార్డు ఏర్పాటు చేసి పలు రంగాల్లో కృషిచేసి సేవలందిస్తున్న వారికి అవార్డులు ప్రధానం చేసి ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడించారు. సమాజ హితం కోసం దేశ అభివృద్ధి కోసం సేవలందిస్తున్న వారికి నిరంతరం అవార్డులు ప్రధానం చేసి ప్రోత్సహిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

186 రోజుల ఆర్టీఐ నిర్లక్ష్యంపై రాష్ట్ర సమాచార కమిషన్ కఠిన చర్యలు

విశ్వంభర, హైదరాబాద్:

రైట్ టు ఇన్ఫర్మేషన్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు బాబురామ్ నాయక్ దాఖలు చేసిన రెండు ఆర్టీఐ దరఖాస్తులకు సంబంధించి 186 రోజుల పాటు సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిన ఘటనపై రాష్ట్ర సమాచార కమిషన్ తీవ్రం గా స్పందించి, సంబంధిత ప్రజా సమాచార అధికారులకు సమాచారం అందించేందుకు ఏడు రోజుల చివరి గడువు విధిస్తూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.ఈ కేసులకు సంబంధించి రెండు కీలక అంశాలు విచారణకు వచ్చాయని తెలిపారు. మొదటగా, మల్లెపల్లి (కొండమల్లేపల్లి), ధనియాల గ్రామం పరిధిలో ఉన్న సుమారు 33 ఎకరాల ప్రభుత్వ బాంచరే భూమిని 1950 సంవత్సరం నుంచి వ్యక్తిగత భూమిగా అక్రమంగా మార్చినట్లు తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఈ అక్రమ మార్పుకు సంబంధించిన భూ రికార్డులు, మార్పుల ఆధారాలు, అనుమతులు, దస్తావేజులను ఆర్టీఐచట్టం ద్వారా కోరినప్పటికీ, అధికారుల నుంచి ఎలాంటి సమాచారం అందించకపోయిన విషయం కమిషన్ పరిశీలనలోకి వచ్చినట్లు పేర్కొన్నారు.అదేవిధంగా, నల్లగొండ జిల్లా డిఆర్డీఓ / డిఆర్డీఏ అధికారిపై నిధుల దుర్వినియోగం, నియామకాలలో అక్రమాలు, గృహ నిర్మాణ పథకాలు మరియు నీటి సరఫరా పథకాల అమలులో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయని ఆయన తెలిపారు. దీనితో పాటు, సంబంధిత అధికారి సర్వీస్ బుక్‌కు సంబంధించిన వివరాలు కూడా ఆర్టీఐ ద్వారా కోరినప్పటికీ, అవి వ్యక్తిగత అంశాలంటూ చెప్పి పూర్తిస్థాయిలో సమాచారం ఇవ్వకుండా తప్పించుకున్న విషయం కూడా కమిషన్ దృష్టికి వచ్చినట్లు స్పష్టం చేశారు.ఆర్టీఐ చట్టం -- 2005 ప్రకారం ఏ దరఖాస్తుకైనా 30 రోజులలోపు సమాధానం ఇవ్వడం తప్పనిసరి అయినప్పటికీ, ఈ రెండుదరఖాస్తులకు సంబంధించి 186 రోజుల ఆలస్యం చేయడం చట్టానికి తీవ్రమైన ఉల్లంఘనగా రాష్ట్ర సమాచార కమిషన్ నిర్ధారించింది.ఈ వ్యవహారంపై స్పందించిన రాష్ట్ర సమాచార కమిషనర్, ఈ రెండు కేసులలోనూ సంబంధిత ప్రజా సమాచార అధికారులకు ఏడు రోజులలోపు పూర్తి, సరైన మరియు స్పష్టమైన సమాచారం అభ్యర్థికి అందజేయాలని ఆదేశాలు పాస్ చేస్తూ, ఇకపై వ్యక్తిగత అంశాల పేరుతో సమాచారం దాచే ప్రయత్నాలు చేస్తే చట్టపరమైన పరిణామాలు తప్పవని కఠిన హెచ్చరిక జారీ చేశారు, అలాగే విధించిన ఏడు రోజుల గడువు ముగిసేలోపు కమిషన్ ఆదేశాలను అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుందని, గడువు దాటినట్లయితే ఈ వ్యవహారం మరింత తీవ్రమైన న్యాయ చర్యల దిశగా వెళ్లడం అనివార్యమని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా బాబురామ్ నాయక్ మాట్లాడుతూ, 186 రోజుల నిర్లక్ష్యం ప్రభుత్వ పారదర్శకతపై జరిగిన తీవ్రమైన దాడి అని, విధించిన ఏడు రోజుల గడువు చివరి హెచ్చరిక మాత్రమేనని, ఈ కాలపరిమితిలో సమాచారం అందించకపోతే రాష్ట్ర సమాచార కమిషన్‌లో తదుపరి చర్యలతో పాటు హై కోర్టును ఆశ్రయించి కచ్చితమైన చట్టపరమైన పోరాటానికి సిద్ధంగా ఉన్నామని, ప్రజల హక్కులు మరియు పారదర్శక పరిపాలన కోసం ఈ పోరాటం కొనసాగుతుందని ఆయన తెలిపారు.

హరీష్ రావు వల్లనే ఈ ప్రాంత రైతులు మోసపోయారు

మంత్రి సీతక్క, ఎంపీ చామల ధ్వజం

విశ్వంభర, సిద్దిపేట: సిద్దిపేట జిల్లా చేర్యాల మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి సీతక్క, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, చేర్యాల ప్రాంతాన్ని చైతన్యానికి అడ్డాగా, పోరాటాలకు పురిటి గడ్డగా అభి వర్ణించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళా సంఘాల అభయ హస్తం రుణాలకు సంబంధించిన 200 కోట్ల రూపాయలను కాజేసిందని, పావలా వడ్డీ పేరుతో 3వేల కోట్ల రూపాయలను దోచుకుందని ఆమె తీవ్రంగా ఆరోపించారు. దీనికి భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉన్న కుటుంబాల్లో ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే 10 లక్షల రూపాయల బీమాతో పాటు తక్షణ సాయంగా రెండు లక్షల రూపా యలు అందజేస్తున్నామని తెలిపారు. చేర్యాల అభివృద్ధి కోసం ఇప్పటికే 36 కోట్ల రూపాయలు ఇచ్చామని, మున్సిపాలిటీకి అదనంగా 15 కోట్లు కేటాయించామని, పట్టణాన్ని మరింత అభివృద్ధి చేయాలంటే 12 మంది కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఆమె కోరారు.మరోవైపు ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, 1300 మంది అమరవీరుల త్యాగాలతో వచ్చిన తెలంగాణలో నీళ్లు, నిధులు, నియామకాలు కేవలం కేసీఆర్ కుటుంబానికే దక్కాయని విమర్శించారు. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని చెప్పి కేసీఆర్ మోసం చేశారని, ఆయన లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నేడు 'కూలేశ్వరం'గా మారిందని ఎద్దేవా చేశారు. కష్టపడి ప్రజల నుండి వచ్చిన నాయకుడు రేవంత్ రెడ్డి అయితే, అమెరికా నుండి వచ్చి పదవులు పొందిన వారు కేటీఆర్ అని చురకలు అంటిం చారు. హరీష్ రావు ఈ ప్రాంతానికి రావలసిన సాగునీటిని సిద్దిపేటకు మళ్లించి స్థానిక రైతులను వంచించారని ఆరోపించారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల చేర్యాల అస్తిత్వాన్ని కోల్పోయిందని, మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల పాలు చేశారని మండిపడ్డారు. గ్రామ పంచాయ తీలకు పెండింగ్‌లో ఉన్న 500 కోట్ల నిధులను విడతల వారీగా చెల్లించామని, చేర్యాల మున్సిపల్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని ఆయన పిలుపునిచ్చారు.

సీఎం రేవంత్‌తో భట్టి విక్రమార్క భేటీ

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: మున్సిపల్ ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రచార వ్యూహాలకు మరింత పదును పెడుతోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేకంగా భేటీ అయ్యారు. దాదాపు గంటకు పైగా జరిగిన ఈ సమావేశంలో ఎన్నికల వ్యూహాలు, అభ్యర్థుల సమన్వయం, పార్టీ అంతర్గత అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. ఇటీవల మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన కీలక సమావేశానికి భట్టి విక్రమార్క హాజరుకాకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఆ గైర్హాజరీపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్న నేపథ్యంలో, నేడు వీరిద్దరూ వ్యక్తిగతంగా భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

కేటీఆర్ కాన్వాయ్‌ను అడ్డుకున్న సిరిసిల్ల ప్రజలు

విశ్వంభర, సిరిసిల్ల :

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం వేడెక్కుతున్న వేళ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అనూహ్య రీతిలో చేదు అనుభవం ఎదురైంది. తన సొంత నియోజకవర్గంలో పర్యటిస్తున్న క్రమంలో స్థానిక ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవ్వడం రాజకీయ వర్గాల్లో కాస్త హాట్ టాపిక్ గా మారింది.

వార్డు 9లో నిరసన సెగ..

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేటీఆర్ సిరిసిల్ల పట్టణంలోని పెద్దూరు బాబాజీ కాలనీ (9వ వార్డు)లో పర్యటించారు. అయితే ఆయన కాలనీలోకి రాగానే స్థానికులు పెద్ద ఎత్తున అడ్డుకుని తమ గోడును వెళ్ల గక్కారు. గతపదేళ్లుగా బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పటికీ, తమ కాలనీకి సంబంధించి కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో స్థానిక కౌన్సిలర్, ప్రభుత్వం విఫలమయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

భూముల సమస్యపై నిలదీత..

ముఖ్యంగా మెడికల్ కాలేజీ నిర్మాణ సమయంలో తాము ఎదుర్కొన్న ఇబ్బందులను ప్రజలు కేటీఆర్ దృష్టికి తెచ్చారు. 'గత పదేళ్లలో మెడికల్ కాలేజీ కోసం మా భూములను లాక్కున్నారు. అభివృద్ధి జరుగుతుందని ఆశపడితే, మాకు ప్రత్యామ్నాయంగా ఇవ్వాల్సిన నివాస స్థలాల విషయంలో ఇప్పటికీ స్పష్టత లేదు. మా భూములు పోయి, ఇల్లు లేక వీధిన పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు' అని బాబాజీ కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్థానిక కౌన్సిలర్ పనితీరుపై అసహనం..

గత పాలనలో బీఆర్ఎస్ కౌన్సిలర్ కనీసం వార్డు వైపు చూడలేదని, సమస్యలనువిన్నవించుకుందామన్నా అందుబాటులో లేరని మహిళలు నిలదీశారు. ఓట్ల కోసం ఇప్పుడు మళ్లీ వస్తున్నారని, గతంలో చేసిన పనులేవో చూపించాలని డిమాండ్ చేయడంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కేటీఆర్ వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ, నిర్వాసితుల ఆందోళన మాత్రం తగ్గలేదు. మున్సిపల్ ఎన్నికల వేళ ఈ నిరసనలు బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.

ప్రభుత్వ వైఫల్యాలను.. కపిపుచ్చుకోవడానికి తిట్ల దండకం

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: కేవలం ప్రభుత్వ వైఫల్యాలను.. హామీల అమలును కపిపుచ్చు కోవడానికి కీలకమైన మున్సిపల్ ఎన్నికల వేళ సీఎం రేవంత్‌రెడ్డి తిట్ల దండకం అందుకున్నారని, ఆయన తిట్ల ట్రాప్‌లో పడొద్దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్ తెలం గాణ సమాజానికి, కార్యకర్త లకు 'ఎక్స్'లో పిలుపునిచ్చారు. తెలంగాణ గడ్డపై ప్రస్తుతం ఒక వికృతమైన రాజకీయ క్రీడ నడుస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పద్నాలుగేళ్ల సుదీర్ఘ పోరాటంతో, ఢిల్లీ పీఠా న్ని గడగడలాడించి స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసిన నాయకుడు కేసీఆర్ అని, ఒక తండ్రిలా ఈ రాష్ట్రాన్ని అక్కున చేర్చుకుని, పడావు పడ్డ తెలంగాణను ప్రగతి బాటలో నడిపించిన మహోన్నత శిల్పి అని కొనియాడారు. కేసీఆర్ ఎప్పు డూ బిరుదుల కోసం, సన్మానాల కోసం పాకులాడలేదని.. ప్రజల శ్రేయస్సు, సంక్షేమమే ఆయనకు నిజమైన సత్కారమని స్పష్టం చేశారు. అధికార గర్వంతో రేవంత్ రెడ్డి కేసీఆర్ వ్యక్తిత్వం మీద విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. ఇది కేవలం ఒక వ్యక్తి మీద జరుగుతున్న దాడి కాదని, తెలంగాణ ఉద్యమ చరిత్ర మీద జరుగుతున్న దాడి అని పేర్కొన్నారు. రేవంత్ పన్నుతున్న తిట్ల ట్రాప్‌లో పార్టీ శ్రేణులు ఎవరూ పడకూడదని సూచించారు. వార్డుల్లోని మౌలిక వసతులు, రోడ్లు, డ్రైనేజీ, ఇంటింటికీ అందాల్సిన పథకాల మీదనే చర్చ పెట్టాలని.. రేవంత్ తన బూతు పురాణంతో అసలు చర్చను పక్కదోవ పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజల కన్నీటిని తుడిచే దిశగా పోరాటం సాగాలని, అబద్ధపు ఆరు గ్యారంటీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు.

కొట్టే చేతికి ఆయుధం దొంగ చేతికి తాళం ఇవ్వద్దు

మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావును కలిసిన లక్సెట్టిపేట మున్సిపల్ కోఆర్డినేటర్ యోగేశ్వర్ రెడ్డి.మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మున్సిపల్ ఎన్నికల కోఆర్డినేటర్ హోదా లో, శుక్రవారం స్థానిక మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ని వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.ఈ సందర్భంగా రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో లక్సెట్టిపేటను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలు, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించాము."

విశ్వంభర, సూర్యాపేట: పట్టణంలో వార్డుకు కౌన్సిలర్ను ఎన్నుకోవడం అంటే మీ ఇంట్లో మనిషిని ఎన్నుకోవాలని ఫోన్ చేస్తే మీ ఇంటి ముందుకు వచ్చే వాళ్ళు ఎన్నిక కావాలని అప్పుడే మీ ప్రతి సమస్య పరిష్కా రం అవుతుందని మీ ఓటుకు న్యాయం జరుగుతుందని మాజీమంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని 16, 18 వార్డులలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 18వ వార్డులో కాంగ్రెస్ పార్టీకి చెందిన 30ఏళ్ల సీనియర్ నాయకులు టిఆర్ఎస్ లో భారీ ఎత్తున చేరగా వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి మనిషిని వదిలి బయటి వ్యక్తికి అవకాశం ఇవ్వవద్దన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో గత పదేళ్లలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. 30 సంవత్సరాలుగా మూసి మురికి నీటిని తాగిన ప్రజలకు స్వచ్ఛమైన కృష్ణ నీటిని మిషన్ భగీరథ ద్వారా అందించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రౌడీయిజం గుండాయిజం దందాలు పెరిగాయని అలాగే వాళ్ళు మన ఆస్తులు తింటుంటే వాళ్లు పెంచిన దోమలు మన రక్తం పిలుస్తున్నాయన్నారు. గత రెండేళ్ల సూర్యాపేట జిల్లా కేంద్రంలో రూపాయి పని చేయలేదని ఎక్కడ తట్టెడు మట్టి కూడా పోయ లేదన్నారు. దొంగలంతా ఒక్కటై వార్డులు పంచుకున్నారని కొట్టే చేతికి ఆయుధం దొంగ చేతికి తాళం ఇవ్వవద్దన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళలకు నెలకి 2500 వస్తాయని ఆశపడ్డారని, యువతకు రెండు లక్షల ఉద్యోగాలు, విద్యార్థులకు స్కూటీల వస్తాయని కన్న కలలు కల్లాలుగా మిగిలాయన్నారు. ప్రజలు అన్ని గమనించాలని మీ ఇంటి ముందు ఉంటూ మీరు పిలిస్తే వచ్చే వ్యక్తిని కౌన్సిలర్ గా గెలిపించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట మున్సిపల్ ఎన్నికల ఇన్చార్జి ఇస్లావత్ రామచందర్ నాయక్, మాజీ రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, ఆయా వార్డుల అభ్యర్థులు రంగినేని ఉపేందర్ రావు, వాంకుడోత్ సక్రు నాయక్, నాయకులు రాంబాబు డాక్టర్ బక్కయ్య, అమ్మనాయక్, గౌతమ్, నరేష్, జ్యోతి సరస్వతిపాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికలు నిరంకుశంగా మారాయి: ఎమ్మెల్సీ

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: రాష్ట్రంలో రాజ్యాంగ నిబద్ధత లేకుండా పోయిందని.. ప్రజాస్వామ్య బద్ధంగా జరగాల్సిన మున్సిపల్ ఎన్నికలు నిరంకుశంగా మారాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అన్నారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికలు అత్యంత దుర్మార్గంగా, హేయమైన రీతిలో జరుగుతున్నాయని ఆరోపించారు. పాలకపక్షం విచ్చలవిడిగా డబ్బులు పంచుతుంటే ఎన్నికల సంఘం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నదని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం, పోలీసులు ప్రేక్షకుల్లా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఆదరించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని.. అందుకే బీఆర్ఎస్‌పై దాడులకు తెగబడుతున్నారని పేర్కొన్నారు.మేడ్చల్ జిల్లా అలియాబాద్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డిపై దాడి చేశారని.. మాజీ మంత్రి హరీశ్‌రావును మంచిర్యాల జిల్లాలో ప్రచారం చేయకుండా అడ్డుకున్నారని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని.. ఎన్నికలు సజావుగా జరిగేలా కనిపించడం లేదని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహించకుండా అంతటా అధికారపక్షం కాంగ్రెస్ గెలిచిందని సర్టిఫికెట్లు ఇస్తే సరిపోతుంది కదా అని ప్రశ్నించారు. కోదాడలో తమ పార్టీ అభ్యర్థి మామిడి దివ్యను కిడ్నాప్ చేశారని.. అక్కడ బీఆర్ఎస్ హిందూ అభ్యర్థినిని బురఖా కప్పి లోపలికి తీసుకెళ్లి విత్ డ్రా చేయించి కాంగ్రెస్ అభ్యర్థి ఎన్నికను ఏకగ్రీవం చేశారని ఆరోపించారు. స్పీకర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థులను బెదిరించి కాంగ్రెస్ కండువాలు కప్పారని పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం వెంటనే స్పందించి మున్సిపల్ ఎన్నికలు సజావుగా జరిగేలా చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు.